క్లుప్తంగా

బ్యాగులు పంపిణీ



బ్యాగులు అందిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్

సారంగపూర్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులకు చరిత్ర అధ్యాపకుడు శ్రీనివాస్ రూ.14వేలు వెచ్చించి బ్యాగులను సమకూర్చారు. ఈ బ్యాగులను బుధవారం ప్రిన్సిపాల్ శంకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. త్వరలోనే విద్యార్థులకు లంచ్‌బాక్సులు అందించనున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

బ్యాంకు వివరాలు చెప్పొద్దు

కుంటాల: అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దని ఎస్సై అశోక్ సూచించారు. బుధవారం మండలంలోని కల్లూరు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కూర్చున్న చోట నుంచి రూ.లక్షలు సంపాదిస్తారని అమాయకులను ఊబిలోకి దింపి మోసం చేస్తున్నారని సూచించారు. మహిళా కానిస్టేబుళ్లు రజిత, అశ్విని, హెడ్ కానిస్టేబుల్ మనోహర్ ఉన్నారు.

ఇంటింటికీ మొక్కలు ఇవ్వండి

లక్ష్మణచాంద: వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు అందించి నాటేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాధ.. సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీసీ దినేశ్ ఉన్నారు.

తాగి నడిపితే జైలుకు పంపిస్తాం



శ్వాస పరీక్ష చేస్తున్న ఎస్సై పెర్సిస్

ముధోల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడిపితే జైలుకు పంపిస్తామని ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. బుధవారం ముధోల్‌లోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

డీఈవోకు ఆహ్వానం

దస్తురాబాద్: తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 7న నిర్వహించే ఉన్నతీకరణ కార్యక్రమానికి రావాలని బుధవారం మండలంలోని రేవోజీపేట గ్రామస్తులు జిల్లాకేంద్రంలో డీఈవో రామారావును కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు పాఠశాలను ఇటీవల అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. నలుగురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

యోగా సాధనతో ఏకాగ్రత



మాట్లాడుతున్న డీఐఈవో పరశురామ్

మామడ: విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి, ఒత్తిడి తగ్గుతుందని డీఐఈవో పరశురామ్ అన్నారు. బుధవారం మామడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను విద్యార్థులు ఇళ్లకు వెళ్లిన తర్వాత రివిజన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం యోగా చేస్తున్న విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ రవికిరణ్,అధ్యాపకులు పాల్గొన్నారు.

'బాలశక్తి'పై అవగాహన

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలశక్తి కార్యక్రమంపై ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) రాణా ప్రతాప్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణ, పోస్టాఫీసు, బ్యాంకులు తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో అందే సేవలను వివరించారు. హెచ్‌ఎం మోహన్, హెచ్ఈవో హరికుమార్, ఉపాధ్యాయులు గంగసురేశ్, ఆదిల్, పోశెట్టి, రవి కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాపరులపై తేనెటీగల దాడి

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్ గ్రామానికి చెందిన మేకల కాపరులు బంక గంగాధర్, జగ్మే దయానంద్‌పై బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. బెల్గాం అడవిలో మేకలు మేపుతుండగా ఒక్కసారిగా వచ్చిన తేనెటీగలు దాడిచేసి చేయడంతో వారు పరుగెత్తారు. సమీపంలోని చేలల్లో పనిచేస్తున్న వారు గమనించి క్షతగాత్రులను కుభీర్ ఆసుపత్రిలో చేర్పించారు.

క్వాలిటీ పరికరాలను పట్టించుకోరూ..

జిల్లాకేంద్రంలో నీటిపారుదలశాఖ క్వాలిటీ కంట్రోల్ పరికరాల కార్యాలయం అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారింది. నీటిపారుదలశాఖ చేపట్టే ప్రాజెక్టుల్లో మెటీరియల్ టెస్టింగ్, కాంక్రీట్ మిక్స్ డిజైన్ పరికరాలతో నిర్మాణంలో నాణ్యత, నీటిప్రవాహం, కాలువల కొలతలను నిర్ధారిస్తారు. ఏవైనా లోపాలుంటే సరిచేయాలని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తారు. కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయని ఈ కార్యాలయానికి అధికారులు (డీఈ, ఈఈ, సబార్డినేట్) ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఇక్కడి కార్యాలయం పైకప్పు రేకులు దెబ్బతిన్నాయి. తాగి పడేసిన మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. వర్షానికి గోడలు నాని రూ.లక్షలు విలువ చేసే పరికరాలు తుప్పుపడుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



దుమ్ము, తుప్పు పట్టి కనిపిస్తున్న పరికరాలు



తాగి పడేసిన మద్యం సీసాలు



దెబ్బతిన్న పైకప్పు

ప్యాడిక్లీనర్లపై నిర్లక్ష్యమెందుకు.?

కుంటాల: మండలంలోని అందకూర్, కుంటాల, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంటలో తాలు, తప్పు శుభ్రం చేసేందుకు సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ నుంచి మూడు ప్యాడిక్లీనర్లను అధికారులు తెప్పించారు. సీజన్‌లో వినియోగించుకొని ఆ తర్వాత నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్యాడిక్లీనర్లు వర్షానికి తడుస్తూ దెబ్బతింటున్నాయి. అధికారులు వాటిని సురక్షితంగా భద్రపర్చాలని రైతులు కోరుతున్నారు.



అందకూర్‌లో వదిలేసిన ప్యాడిక్లీనర్



కుంటాలలో..

సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణ

సారంగపూర్: నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్‌రూరల్ సీఐ ఎం.కృష్ణ అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ప్రాధాన్యత, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న చోట నేరాలు తగ్గాయన్నారు. చాలా కేసుల్లో నిందితులను పట్టించడంలో సీసీ కెమెరాలు ఉపకరించాయన్నారు. బ్యాంకు సిబ్బంది, అధికారులెవరూ ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు అడగరని గుర్తు చేశారు. సైబర్ మోసాల బారిన పడితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఆకాశ్, వినోద్, ఇక్బాల్, మహిళా కానిస్టేబళ్లు గిరిజ, అనసూయ తదితరులు ఉన్నారు.

4న హైదరాబాద్ తరలిరావాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత రామ్‌భూపాల్

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లో ఈనెల4న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు తరలిరావాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్‌భూపాల్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని కోరారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నియమితులైన కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సమస్యలపై పీఆర్టీయూ పోరాటం



మాట్లాడుతున్న రమణారావు

భైంసారూరల్: ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్టీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు అన్నారు. బుధవారం మండలంలోని మాటేగాం గ్రామంలో నిర్వహించిన పీఆర్టీయూ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ ఉత్తర్వులు త్వరలో వెలువడతాయన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ విషయమై ప్రభుత్వానికి విన్నవించినట్లు వివరించారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమేశ్, రవి, అబారావు తదితరులు ఉన్నారు.

9న సమ్మె విజయవంతం చేయాలి

ఖానాపూర్: ఈ నెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడంతో నష్టం జరగనుందని తెలిపారు. నాయకులు డాకూరి తిరుపతి, నాగెల్లి నర్సయ్య, నారాయణ, అభిషేక్ యాదవ్ ఉన్నారు.

దస్తురాబాద్: కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ పేర్కొన్నారు. దస్తురాబాద్‌లో పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు గీత, పూజిత, రాజేశ్, మొగిలి, దేవక్క, మంజుల, లాస్య, రాజేందర్ ఉన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి



ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

భైంసాటౌన్: భైంసా మార్కెట్‌లో యూరియా, డీఏపీ కొరత లేకుండా చూడాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ వీణను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. సొసైటీల్లో యూరియా, డీఏపీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తోట రాము, రైతులు రావుల శివ, సాయినాథ్, పోశెట్టి, బాబు, రాజేశ్వర్, గంగాధర్, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

గ్రామ్ నిరీక్షణ సంస్థను కాపాడుకుందాం

ముధోల్: మండలకేంద్రంలోని గ్రామ్ నిరీక్షణ సంస్థను, దాని ఆస్తులను కాపాడుకోవాలని దివ్యాంగుల సంఘం నాయకులు బురుగుల రాజు, జనసేన పార్టీ నాయకులు సుంకేట మహేశ్‌బాబు అన్నారు. బుధవారం ముధోల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదర్శ దివ్యాంగుల కోసం ఏర్పాటైన సంస్థలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. సంస్థకు వచ్చే లాభనష్టాలు గురించి బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో చర్చించడం లేదని.. డైరెక్టర్ కమిటీ సభ్యులు తీర్మానం లేకుండానే భవనాలు కూల్చి, చెట్లను నరికి వేశారన్నారు. కెనాల్ ద్వారా భూమి కోల్పోతే నిధుల లెక్క చెప్పలేదన్నారు. భూములను విక్రయించే ఊహగానాలు పలు అనుమానాలకు దారి తీస్తున్నాయని వాపోయారు. దివ్యాంగుల భవిష్యత్తు కోసం పరిశ్రమలు, ఉత్పత్తయ్యే కేంద్రాలను ఏర్పాటు చేసి దివ్యాంగులను అభివృద్ధిపథంలో నడపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు భోజారెడ్డి తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఉత్సవాలను జయప్రదం చేయాలి

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న ముత్యాల పోచమ్మ, ఊల్లే పోచమ్మ ఆలయ వార్షిక ఉత్సవాలను జయప్రదం చేయాలని గంగపుత్ర సంఘం నాయకులు కోరారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాలను గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం గంగనీళ్లతో అభిషేకం, గొల్లెన, బోనాలతో ఊరేగింపు, రాత్రికి ముత్యాల పోచమ్మ అమ్మవారి కథ ఉంటుందన్నారు. శుక్రవారం అమ్మవారికి పూజలు, మొక్కుల చెల్లింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

సన్మానం

ఖానాపూర్: మండలంలోని పాతతర్లపాడ్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల రిటైరైన హెచ్‌ఎం మాలెపు రాజశంకర్‌ను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. వీడీసీ నాయకులు ఆది మల్లారెడ్డి, బొంత సాయన్న, విశ్రాంత ఎంఈవో ప్రేమ్‌సాగర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజశేఖర్, కార్యదర్శి సురేశ్, ఉపాధ్యాయులు శ్యాం, విద్యాసాగర్, నర్స య్య, లక్ష్మీనర్సయ్య, నర్సింగ్‌రావు, రమేశ్ ఉన్నారు.

కీలక పోస్టుల్లో ఇన్‌చార్జీలే..

- తానూరు మండలంలో గాడి తప్పుతున్న పాలన
- అధికారుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బంది పడుతున్న జనం



అధికారుల పర్యవేక్షణ లేక అధ్వానంగా బెంబర రోడ్డు



ఖాళీగా తహసీల్దార్ కుర్చీ

తానూరు: ఇన్‌చార్జుల పాలనతో తానూరు మండలంలో అభివృద్ధి కుంటుపడుతున్నా.. ఉన్నతాధికా రులు పట్టించుకోవడం లేదు. మండలానికి కీల కమైన తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఈజీఎస్ ఏపీవో, ఎస్సై, వైద్యాధికారి పోస్టులు ఖాళీగా దర్శనమి స్తున్నాయి. ఆయా చోట్ల ఇన్‌చార్జి అధికారులే విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పనుల నిమిత్తం ఆయా శాఖల కార్యాలయాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని మండలవాసులు వేడుకుంటున్నారు.

తానూరు మండలంలో కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో కిందిస్థాయి అధికారులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో వారు ఏ సమయానికి వచ్చి వెళ్తున్నారో తెలియని దుస్థితి నెలకొంది. ఎంపీవోకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారానికి రెండు, మూడుసార్లు జిల్లాకేంద్రంలో సమావేశాలు ఉండడంతో గ్రామాల్లో అధికారి పర్యవేక్షణ కరువైంది. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు సరిగా నిర్వహించడం లేదని మండల వాసులు వాపోతున్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు..

ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రిటైర్ అవ్వగా డిప్యూటీ తహసీల్దార్ గంగయ్యకు అదనపు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయి తహసీల్దార్ లేకపోవడంతో భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలు కావాల్సినవారు, రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కుంటుపడుతున్న విద్యావ్యవస్థ ..

కొన్నేళుగా ఎంఈవో పోస్టు ఖాళీగా ఉండగా.. ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎంకు ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతోపాటు, సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారు.

ఐదేళ్లుగా ఏపీవో పోస్టు ఖాళీ...

ఇక్కడ పనిచేసిన ఏపీవో బాసర మండలానికి బదిలీ కాగా ఐదేళ్లుగా ఏపీవో పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పల్లె ప్రకృతివనాలు, వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలపై పర్యవేక్షణ కరువైంది. ఉపాధిహామీ పథకం కింద ఏయే కార్యక్రమాలు అమలవుతాయో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

శాంతిభద్రతలపై నిఘా కరువు ...

ఇక్కడ పని చేసిన ఎస్సై బదిలీ కావడంతో శాంతిభద్రతలపై నిఘా కరువైంది. మూడు నెలలుగా ట్రైనీ ఎస్సైతోనే నెట్టుకొస్తున్నారు. గ్రామాల్లో అల్లర్లు చోటు చేసుకుని శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోంది.

రెగ్యులర్ ఇక్కడ.. బాధ్యతలు అక్కడ ...

తానూరు మండలానికి రెగ్యులర్‌గా కొనసాగుతున్న ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పృథ్వీకి బాసర, దిలావర్‌పూర్ మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఎక్కడ విధులు నిర్వర్తిస్తారో తెలియని స్థితి నెలకొంది. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. సమస్య విన్నవిద్దామంటే ఆయన ఉండటం లేదు. ఫోన్‌లోనూ స్పందించడం లేదని పలువురు మండల వాసులు వాపోతున్నారు.

- ఇక్కడి ఏఈ ప్రదీప్‌కు బాసర ఏడీగా బాధ్యతలు అప్పగించడంతో మండలంలో పర్యవేక్షణ కరువైంది. గ్రామాల్లో ఎల్సీ పేరిట గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతోంది. సమస్యలు విన్నవించేందుకు సైతం బాసర వెళ్లాల్సి వస్తోందని రైతులు, వినియోగదారులు వాపోతున్నారు.
- ముధోల్ పీఆర్ సబ్‌డివిజన్‌లో విధులు నిర్వర్తించే శివలింగయ్యను డిప్యూటేషన్‌పై తానూరుకు పీఆర్ ఏఈగా నియమించారు. మళ్లీ బాసర అదనపు ఏఈగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఆచూకీ కోసం వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతుల్లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

ముధోల్: మండలంలోని సరస్వతీనగర్‌గ్రామంలో బుధవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నూతన కమి టీని ఎన్నుకున్నారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగభూషణ్ హాజరయ్యారు. గ్రామ అధ్యక్షుడిగా కల్యాణ్‌కర్ అవినాష్, ఉపాధ్యక్షుడిగా కల్యాణ్‌కర్ దిగంబర్, ప్రధాన కార్యదర్శిగా వాగ్మారే సాయి, కార్యదర్శిగా కల్యాణ్‌కర్ శేషురావు, ప్రచార కార్యదర్శిగా కల్యాణ్‌కర్ విక్టర్, కోశాధికారిగా కల్యాణ్‌కర్ సాయినాథ్, కార్యవర్గ సభ్యులుగా దత్తహరి, కల్యాణ్, శ్యామ్ తదితరుల ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నందకుమార్‌మాదిగ, కత్తి బాబు మాదిగ, మాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ సాయిచంద్, ఆత్మ స్వరూప్, గౌరవ అధ్యక్షులు కల్యాణ్‌కర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధిత కుటుంబానికి అండ

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామానికి చెందిన బొగుడమీది సంతోష్ (36) ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి వారం రోజులకే అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ విషయాన్ని నాయకులు, గ్రామస్తులు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. విదేశాంగశాఖ, రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడారు.

అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: మండలంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో న్యూఇండియా లిట్రసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 15ఏళ్ల పైబడినవారు ప్రతి 15 మంది నిరక్షరాస్యులకో ట్యూటర్‌ను నియమించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఐకేపీ మహిళా సభ్యులు కీలకంగా వ్యవహరించాలని కోరారు. ఉపాధ్యాయులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అశోక్‌వర్మ, వైద్యురాలు ప్రత్యూష, ఎంపీఓ అమీర్‌ఖాన్, ఏపీఎం వాణిశ్రీ, ఏపీవో ప్రమీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు

భైంసారూరల్: ముధోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధ విగ్రహం సమస్య పరిష్కారానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని దేగాంలోని తన నివాసంలో బుధవారం బుద్ధ అంబేడ్కర్ ఐడల్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు కలిసి సన్మానించారు. ప్రభుత్వంతో చర్చించి బుద్ధ విగ్రహం ఏర్పాటుకు 20 గుంటల భూమి కేటాయించేలా కృషి చేసినందుకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు దేవిదాస్ హస్బే, ఉపాధ్యక్షులు దిగంబర్ మగ్గిడి, రాములు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి రాజారాం, గిరిధర్ జంగ్మే, గంగాధర్ జాడే, రమేశ్, గంగన్న తదితరులు ఉన్నారు.

గోరింటాకు వేడుక

నిర్మల్‌టౌన్: ఆషాఢమాసం నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని శ్రీవిద్యానికేతన్ ఒలంపియాడ్ పాఠశాలలో బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గోరింటాకు పెట్టుకుంటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్ అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా 70, 75, 80, 85 ఏళ్ల దాటిన పెన్షనర్లకు మెమెంటో అందించి సన్మానించారు. విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు రాజమౌళి, లక్ష్మీరాజం, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న సాయిశిల్ప

సోన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉంటామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాయిశిల్ప అన్నారు. బుధవారం మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై సోన్ పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.